క్లుప్తంగా

నేడు మదనగోపాలునికి నవనీత సేవ


శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామికి గురువారం నవనీత (వెన్న) అభిషేకం నిర్వహిస్తున్నట్లు పాలకమండలి చైర్మన్ మధు గోపి తెలిపారు. ఆలయ అర్చకులు గుడిపూడి శేషాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి స్వామివారి మూల విరాట్ విగ్రహానికి నవనీత అభిషేకం ప్రారంభం అవుతుందని, పది గంటల వరకు కొనసాగే ఈ కార్యక్రమానికి భక్తులు ఆవు వెన్నను సమర్పించుకోవచ్చని తెలియజేశారు.

ముత్యాలమ్మకు నక్షత్ర హారతి


ముత్యాలమ్మ అమ్మవారికి నక్షత్ర హారతి సమర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం శ్రీచక్ర సహిత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారికి నక్షత్ర హారతి సమర్పించారు. తొలుత అమ్మవారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పసుమర్తి గుప్త, రమాదేవి దంపతులు అమ్మవారికి నక్షత్ర హారతిని బహూకరించారు. ఈ కార్యక్రమంలో చోడవరపు రంగా దంపతులు, ఊటుకూరి నగేష్ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ ఆషాఢమాస చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి శాకంబరి అలంకరణ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి దాతలు, కూరగాయలు, పండ్లు గురువారం మధ్యాహ్నం 2 గంటలకల్లా అందించాలని, వివరాలకు ఆలయంలో సంప్రదించాలన్నారు.

జగనన్న సురక్ష.. ప్రజలకు రక్ష

బుట్టాయగూడెం : ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు సంక్షేమ పథకాలు అందనివారు ఎవ్వరూ ఉండకూడదనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గిరిజన సంక్షేమ శాఖామంత్రి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని తెల్లంవారిగూడెంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులకు సరిఫికెట్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతోపాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే వినతులను అనుసంధానం చేసుకుని నెలరోజుల పాటు ప్రజల సమస్యలను పరిష్కరించేలా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ వేణు గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ద్వారకాతిరుమల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని గుండుగొలనుకుంట గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి పనులను చేశారన్నారు. జగనన్నకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు నోటికొచ్చినట్టు విమర్శిస్తున్నాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వము చేయని విధంగా కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, వైస్ ఎంపీపీ ఎలమర్తి దుర్గాదేవి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వామిశెట్టి ఆంజనేయులు, సొసైటీ చైర్‌పర్సన్‌లు గోపా నాగేశ్వరరావు, గుర్రాల లక్ష్మణ్, బండారు వెంకన్నబాబు, బండారు నాగసుబ్బారావు, ద్వారకాతిరుమల సర్పంచ్ కుంటం స్వర్ణలత, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఆచంట బన్ను, ఘంటా విఘ్నేశ్వరరావు, చెలికాని బుల్లియ్య, కుమ్మరి రమేష్, తహసీల్దార్ కె.సతీష్, ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్ తదితరులున్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని చక్రదేవరపల్లి, దేవులపల్లి గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టారు, ఎంపీపీ


బుట్టాయగూడెం : దొరమామిడిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, ఎమ్మెల్యే బాలరాజు

కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రాము, సర్పంచ్ దోరేపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ ప్రగడ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైఎస్సార్ సీపీ నాయకులు కొలనువాడ సాయిరాజు, సచివాలయాల కన్వీనర్లు ప్రగడ గోపాలకృష్ణ, దోరేపల్లి చెన్నయ బాబు, కట్టూరి జాన్ రాజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సురక్ష

చింతలపూడి : సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి -1 సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు వివిధ రకాలైన ధ్రువపత్రాలను ఎంపీపీ రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్‌లతో కలిసి అందచేశారు. సచివాలయ పరిధిలో మొత్తం 500 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తుల్లిమెల్లి రాణి, వైస్ ఎంపీపీ ఎస్.వరలక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

కామవరపుకోట : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాలని జెడ్పీటీసీ కడిమి రమేష్, ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అన్నారు. మండలంలో కేఎస్ రామవరంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు కుల, ఆదాయం, పొలం అడంగుల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ద్వారకాతిరుమల : గుండుగొలనుకుంటలో ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

బోడిగూడెంలో జగనన్న సురక్ష

కొయ్యలగూడెం : బోడిగూడెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.33 లక్షలతో నిర్మించబోయే తాగునీటి పైప్‌లైన్‌కి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, ఎంపీటీసీ జాన్ డేవిడ్‌కింగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు వి.సత్యనారాయణ, చల్లా సుబ్బారావు, వి.పోలేశ్వరరావు, తేలే భూషణం, మండల కోకన్వీనర్ తాడిగడప రామకృష్ణ, డి.బాబురావు, గంటా రాంబాబు, మోపిదేవి వాసు, తిర్లతి సాయి పాల్గొన్నారు.

ప్రగడవల్లిలో జగనన్న సురక్ష

పోలవరం రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం ప్రగడవల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఎంపీడీవో జి.శ్రీను, తహసీల్దార్ బి.సుమతి, వైస్ ఎంపీపీ మిడియం సింగరాజు, ఎంపీటీసీ దాపర్తి మోహన్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజుపోతేపల్లిలో జగనన్న సురక్ష

టి.నరసాపురం : అర్హులకు సంక్షేమ పథకాల ఫలాలను అందించేందుకు జగనన్న సురక్ష ఉపయోగపడుతుందని జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణరాజు అన్నారు. రాజుపోతేపల్లిలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. 500 మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ శ్రీనురాజు, పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు, సర్పంచ్ బొంతు రమాదేవి అంజిబాబు, ఎంపీటీసీ బి.రాంబాబు పాల్గొన్నారు.

ఇంటివద్దకే సంక్షేమ పథకాలు

లింగపాలెం : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువపత్రాలు జగనన్న సురక్ష గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వస్తున్నాయని మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు అన్నారు. బుధవారం కె గోకవరం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభలో అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు సీహెచ్ శివాజీ, టి.మోహనరావు, మందలపు నరసింహరావు, కె రఘు, మండల ప్రత్యేకాధికారి ఏపీ ఆర్ గంగాధరబాబు, తహసీల్దార్ మురళీకృష్ణ, ఈవోపీఆర్‌డీ రత్నకుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

వలంటీర్ వల్లే నేను, నా బిడ్డ ప్రాణాలతో ఉన్నాం



మాది చింతలపూడి మండలం, రాఘవాపురం. కరోనా లాక్‌డౌన్ సమయంలో గ్రామం నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించారు. ఆ సమయంలో నేను నిండు గర్భిణిని. నాకు పురిటి నొప్పులు రావడంతో ఏంచేయాలో తెలియక మా వలంటీర్ తగడం వెంకటేశ్వర్రావుకు ఫోన్ చేశాము. అతను వచ్చి అధికారులకు పరిస్థితి వివరించి ఏఎన్ఎం అరుణ, ఆశ వర్కర్ రుక్మిణీల సహాయంతో ప్రైవేట్ వాహనంలో సత్తుపల్లి తీసుకు వెళ్లాడు. అక్కడి డాక్టర్లు చేర్చుకోవడానికి నిరాకరించడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. ఆపరేషన్ చేసి పురుడు పోయడంతో నాకు మగబిడ్డ జన్మించాడు. మా వలంటీర్ సహకారం వల్లే నేను, నా బిడ్డ ప్రాణాలతో ఉన్నాము.

– మేకల నాగలక్ష్మి, రాఘవాపురం, చింతలపూడి మండలం

వలంటీర్ అండగా నిలిచింది



నేను కుక్కునూరు మండల కేంద్రంలోని సంజయ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటాను. కరోనా కష్టసమయంలో నాకు కరోనా సోకి ఇబ్బంది పడుతుంటే మా వలంటీర్ సున్నం రజనీ ఇంటి చుట్టూ బ్లీచింగ్ చల్లించడంతో పాటు, ఇంట్లోకి వంట నిమిత్తం ఏమైనా అవసరమైతే తానే స్వయంగా తెచ్చి ఇచ్చేది. అంతేకాక కరోనా మందులు వాడుతున్నానా లేదా అని వాకబు చేయడంతో పాటు మందులు ఇంకా ఏమైనా అవసరం ఉంటే ఆమే తెచ్చి ఇచ్చేది. కరోనా సమయంలో సొంతవారు కూడా చేయని సేవలను వలంటీర్‌లు అందించారు.

– మల్లేల చంటినాయుడు, సంజయ్‌నగర్ కాలనీ, కుక్కునూరు

ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తోంది



అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న నాకు ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారుజామునే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తోంది. కరోనా సమయంలో కూడా క్రమం తప్పకుండా ప్రతి నెలా పింఛన్ ఇచ్చి వెళ్లేది. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం గురించి ఇంటికి వచ్చి చెప్పి, అవి మాకు అందేలా వలంటీర్ చూస్తోంది.

– వలవల రామచంద్రరావు, వృద్ధుడు, రేపల్లెవాడ

ఎంతో సంతోషం కలిగింది



నా పేరు రాయల రమేష్‌బాబు. టి.నరసాపురం మండలం బొర్రంపాలెం సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్నాను. నాకు కేటాయించిన కుటుంబాలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందిస్తున్నాను. ఇటీవల గ్రామానికి చెందిన మొరవనేని గోపాలరావు ప్రమాదంలో గాయపడి విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, అక్కడికి వెళ్లి పింఛన్ అందించి వచ్చాను. గోపాలరావు నా పట్ల చూపిన కృతజ్ఞతభావం ఎంతో సంతోషాన్ని కలిగించింది.

54 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పోలవరం-2 సచివాలయం పరిధిలోని పాత నూతనగూడెంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర వైద్య సహాయకులు ఎన్‌జీఎస్ శ్రీనివాస్ 54 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను కూడా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఇద్దరికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించామని, వారికి ఆపరేషన్ చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి ఆగమ పాఠశాలకు కంప్యూటర్ల బహూకరణ


కంప్యూటర్లను అందజేస్తున్న దుర్గాదేవి, సత్యవతి

ద్వారకాతిరుమల : శ్రీవారి దేవస్థానం ఆగమ పాఠశాలకు గుంటూరుకు చెందిన అక్కచెల్లెళ్లు వెలగలేటి దుర్గాదేవి, సత్యవతి 4 కంప్యూటర్లను బహుకరించారు. వీటిని ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావుకు అందజేశారు. ఆగమ విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించేందుకు వీటిని వినియోగించాలని ఈ సందర్భంగా దాతలు కోరారు. గతంలో సైతం ఈ దాతలు చినవెంకన్న దేవస్థానానికి ఎయిర్ కూలర్స్, అంబులెన్స్, బ్యాటరీ కార్లు, చిల్డ్రన్స్ పార్క్‌లో పరికరాలను అందజేశారు. వీరి దాతృత్వాన్ని ఆలయ అధికారులు అభినందిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ప్రతిభ


బుల్లా సౌమ్యశ్రీ

చింతలపూడి : చింతలపూడి మండలం రాఘవాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బుల్లా సౌమ్యశ్రీ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌టిఏ శ్రేష్ఠ పరీక్షల్లో ఆలిండియా 127వ ర్యాంక్ సాధించింది. శ్రేష్ఠ పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి విద్యా సంస్థల్లో ఉచితంగా చదువుకునే అవకాశం కల్పిస్తుంది.

దర్యాప్తు వేగవంతం చేయాలి

బుట్టాయగూడెం : పులిరామన్నగూడెం పాఠశాల విద్యార్థి అఖిల్ వర్ధన్ రెడ్డి మృతిపై దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను శిక్షించాలని ఏటీఏ నాయకులు జలగం రాంబాబు, సరియం నాగేశ్వరరావు, తెల్లం రాములు, వంజం ధర్మరాజు, సోదెం రాజు, కారం దారయ్య కోరారు. బుధవారం సింగన్నపల్లి కాలనీలో ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు విద్యార్థి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశం


సమావేశంలో పాల్గొన్న రేషన్ డీలర్లు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం డివిజన్ రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం డివిజన్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద రాష్ట్ర అధ్యక్షులు మండాది వెంకటరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన విజయవాడ సింగ్ నగర్లో మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో రేషన్ డీలర్ల మహాసభ నిర్వహిస్తున్నామని, డీలర్లు తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సభలో మెరుగైన జీవన భృతి కల్పించడానికి తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐతా కిషోర్, విజయవాడ సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, ఏలూరు జిల్లా అధ్యక్షులు తలారి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎ.ఉదయశ్వరరావు, వర్కింగ్ అధ్యక్షులు వెంకటేశ్వర్ నాయక్, కేఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యక్షులు యు.జయరాజు, పోలవరం, బుట్టాయిగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ లబ్ధి


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందచేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

చింతలపూడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వార ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. చింతలపూడి మండలం, వెంకటాద్రిగూడెం సచివాలయం పరిధిలో బుధవారం త్సల్లాబత్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ప్రతి ఇంటికి వెళ్లి అందరిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి నేరుగా సంక్షేమ లబ్ధి చేకూరుస్తున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని అన్నారు. సాంకేతిక కారణాలతో ఎవరికైనా పథకాలు అందకపోతే ప్రస్తుతం జరుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో తగిన ధ్రువపత్రాలు తీసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారికి కూడా పథకాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు అంతర్గత రహదారులు అభివృద్ధి చేయాలని కోరారు. తొలుత గడపగడపకు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఎలీజాకు పట్టణ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఒకపక్క జోరున వాన కురుస్తున్నా లెక్క చేయకుండా హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, పి భాస్కర్రావు, రాజారమేష్, యడ్ల మోహన్‌రావు, చుండూరి నాగేశ్వరరావు, కె శివరామకృష్ణ, తాండ్ర రామకృష్ణారావు, కుప్పాల రామకృష్ణ, ఎన్ దుర్గారావు, కొప్పుల నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు మరింత చేరువగా గోద్రెజ్ సేవలు

గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఈడీ బర్జిస్ గోద్రెజ్ వెల్లడి


సీహెచ్ పోతేపల్లిలో గోద్రెజ్ సమాధాన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఆ సంస్థ ఈడీ బర్జిస్ గోద్రెజ్

ద్వారకాతిరుమల : ఆయిల్‌పామ్ రైతులకు గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సేవలను మరింత చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా మరో 30 సమాధాన్ సెంటర్లను ప్రారంభించనున్నట్టు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బర్జిస్ గోద్రెజ్ తెలిపారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో నూతనంగా నిర్మించిన సమాధాన్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బర్జిస్ గోద్రెజ్ మాట్లాడుతూ ప్రతి 2 వేల హెక్టర్ల విస్తీర్ణానికి ఒక సమాధాన్ సెంటర్‌ను ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించి, వారి ఆర్థికాభివృద్ధికి గోద్రెజ్ తోడ్పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల్లో తాము కూడా భాగస్వాములవుతూ, వారికి సత్వర సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆత్మ నిర్భర్ నినాదంతో తెలుగు రాష్ట్రాల్లోని రైతన్నలకు గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ద్వారా విస్తృత సేవలు అందించే లక్ష్యంతో తాము ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నట్టు తెలిపారు. గోద్రెజ్ వన్‌స్టాప్ సొల్యూషన్ సమాధాన్ సెంటర్ల ద్వారా రైతులు అనేక రకాల సదుపాయాలను పొందొచ్చన్నారు. సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, డ్రిప్ పరికరాలు, ట్రాక్టర్లు, మల్చర్లు వంటి అన్ని రకాల పరికరాలు ఈ సమాధాన్ సెంటర్‌లో రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. మార్కెట్ కంటే తక్కువ ధరలకు తాము అన్ని సేవలను అందిస్తున్నామని చెప్పారు. రైతులు ఈ సమాధాన్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈఓ సగోటానియోగి ఏవీపీ, చావా వెంకటేశ్వరరావు, జనరల్ మేనేజర్ మహంతి, డీజీఎంలు నాగ ప్రవీణ్, స్వీటీ, మురళి, శ్రీనివాస రఘు, మేనేజర్ దీపక్, సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నేడు అంకన్నగూడెంలో ప్రభుత్వ భవనాల ప్రారంభం

పెదవేగి : పెదవేగి మండలం అంకన్నగూడెంలో సుమారు రూ.82 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాలను, ఆర్బీకే ,హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించేందుకు మంత్రి, ఎమ్మెల్యేలు పాల్గొంటారని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ చెప్పారు. గురువారం ఉదయం ప్రారంభించినున్న ఈ కార్యక్రమాల్లో ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్, స్థానిక ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని ఎంపీడీఓ తెలియజేశారు. ఈ భవనాల ప్రారంభోత్సవం తరువాత ఏలూరు గోదావరి కాన్ఫరెన్స్ హాల్లో ఇన్‌చార్జ్ మంత్రి విశ్వరూప్ ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గం సమీక్ష సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెదవేగి మండలస్థాయి అధికారులు అందరూ వారి శాఖల అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీవో వివరించారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్) : కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో అధికంగా వసూలు చేస్తున్న ఫీజులను అరికట్టాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్ళెం కిషోర్ డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేట సీపీఎం కార్యాలయం వద్ద ఏలూరు నగర కమిటీ సమావేశం బి.సోమయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని తల్లిదండ్రులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదివిస్తున్నారన్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో నిలువ దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉన్నప్పటికీ అది ఎక్కడా అమలు కావడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు విద్యాహక్కు చట్టం 2009ని ఖచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం ఏలూరు నగర నాయకులు పాల్గొన్నారు.